సాక్షి ఒడిశా

మంగళవారం । 15 । ఆగస్టు । 2023

I



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 8.30.739లు ,బంగారం 31 గ్రాముల 200 మిల్లీగ్రాములు, వెండి 359 గ్రాముల 500 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



తూర్పుకోస్తా రైల్వేలో మరో ముందడుగు

తూర్పు కోస్తా జోన్ నాభికేంద్రం ఖుర్దారోడ్ మండలం ప్రధాన కార్యాలయంలో అత్యాధునిక రైలు నిర్వహణ కేంద్రాన్ని (టీఎంసీ) రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సోమవారం ప్రారంభించారు.

- IIలో

ఎట్ హోం కార్యక్రమం రద్దు

భువనేశ్వర్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజ్ భవన్‌లో నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమం రద్దయ్యినట్లు గవర్నర్ అధికారిక ట్విట్టర్ హ్యాండిల్‌లో సోమవారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషి లాల్ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరగాల్సింది. కార్యక్రమం రద్దుకు సంబంధించి నిర్దిష్ట కారణాలేవీ స్పష్టం కాలేదు. అనివార్య పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

న్యూస్‌రీల్

ముస్లింల అభివృద్ధికి కృషి

● ఎంపీ చంద్రశేఖర్ సాహు



వేదికపై ఎంపీ చంద్రశేఖర్ సాహు తదితరులు

బరంపురం: గంజాం జిల్లాలో ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తున్నామని బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు తెలియజేశారు. స్థానిక ఖాజా వీధిలో గంజాం ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ముస్లింలు ఉన్నతంగా ఎదిగేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విక్రమ్ పండా, మేయర్ సంఘమిత్ర దొళాయి, ఛత్రపూర్ ఎమ్మెల్యే సుభాష్ చంద్ర బెహరా, జిల్లా ప్రణాళిక బోర్డు చైర్మన్ డా.రమేష్ చంద్ర చావ్ పట్నాయక్, ముస్లిం కమ్యూనిటీ అధ్యక్షుడు అబ్దుల్ హాదీరిస్, ఉపాధ్యక్షుడు మహ్మద్ సలీం, కార్యదర్శి రహీం ఖాన్, యువజన అధ్యక్షుడు ఫైజర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి మాజీ ఎమ్మెల్యే కృష్ణ సగారియా



మాజీ ఎమ్మెల్యే కృష్ణ సగారియా

కొరాపుట్: మాజీ ఎమ్మెల్యే కృష్ణ సగారియా తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సగారియా కొరాపుట్ రిజర్వ్‌డ్ స్థానం నుంచి కాంగ్రెస్ తరుపున 2009–14 మధ్య ఎమ్మెల్యేగా పనిచేశారు. అనంతర పార్టీకి రాజీనామా చేసి బీఎస్పీలో చేరారు. 2014లో ఆ పార్టీ తరుపున కొరాపుట్, జయపురం స్థానాల్లో పోటీచేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం కొరాపుట్ పార్లమెంటరీ పరిధిలో మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగో, మాజీ ఎంపీలు హేమావతి గొమాంగ్, జయరాం పంగిలు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. ఈ నేపథ్యంలో సగారియా సైతం ఈనెల 21న చేరుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కేవలం కొరాపుట్ పార్లమెంటరీ స్థానంలో మాత్రమే కాంగ్రెస్ పార్టీలోకి భారీగా వలసలు పెరుగుతుండడంతో ఆసక్తికరంగా మారింది.

పట్టాలు తప్పిన ఓహెచ్‌సీ



ఓహెచ్‌సీ పట్టాలు తప్పిన దృశ్యం

రాయగడ: రైల్వే ట్రాక్‌లో విద్యుదీకరణ పనులకు వినియోగించే ఓహెచ్‌సీ (ఒవర్ హెడ్ కార్) భళ్లుమస్కా రైల్వేస్టేషన్‌కు సమీపంలో పట్టాలు తప్పింది. సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి అప్రమత్తమైన రైల్వే సంబంధిత శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పునరుద్ధరణ పనులను చేపట్టారు. ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని సమాచారం .

పేకాటరాయుళ్లు అరెస్టు



అరెస్టైన పేకాటరాయుళ్లు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, పేకముక్కలు

మల్కన్‌గిరి: జిల్లాలోని పోలీసులు ఆదివారం రాత్రి ఏఎస్‌ఐ భుజంగ కుమార్ జాన నేతృత్వంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో మల్కన్‌గిరి సమితి ఎంవీ 84 మరియు 83 గ్రామాల్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో వెంటనే 84 గ్రామంలోని ఒక ఇంటిపై దాడిచేసి ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. వీరిలో ఎంవీ 84 గ్రామానికి చెందిన అమాల్ దే, బాలాయి మండాల్, ఎంవీ 83 గ్రామానికి చెందిన అముల్యా సర్దార్, సోమాల్ రాయ్, పద్మాగిరికి చెందిన సోమాల్ అధికారి ఉన్నట్లు నిర్ధారించారు. వారి వద్ద నుంచి రూ.20,820 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మల్కన్‌గిరి కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.

ఈ జెండా.. మనకు అండ



● గిరిజనులకు అవగాహన కల్పించిన జవాన్లు

● మార్కిగూడ్లలో తొలిసారి ఎగురనున్న త్రివర్ణ పతాకం

జాతీయ జెండాలతో గ్రామస్తులు

ద్విచక్ర వాహనాలతో గ్రామానికి వెళ్తున్న జవాన్లు



జాతీయ జెండాలతో మార్కిగూడ విద్యార్థులు



గ్రామంలోని కొండల వద్ద జాతీయ జెండాలతో జవాన్లు

దేశమంతా 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు సిద్ధమవుతున్న వేళ.. ఆ గ్రామంలో తొలిసారి త్రివర్ణ పతాకం నింగిన ఎగరనుంది. ఎన్నో ఏళ్లుగా స్వాతంత్య్ర దినోత్సవం అంటే మావోలు పిలుపునిచ్చే బ్లాక్ డేగానే తెలిసిన అక్కడి ప్రజలకు, మూడు రంగుల మువ్వన్నెల జెండా గొప్పదనం తెలియనుంది. దట్టమైన అడవి ప్రాంతంలో ఉన్నటువంటి మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి మార్కిగూడ గ్రామంలో పరిస్థితి ఇది. ఒకప్పుడు మావోల చేతిలో కీలుబొమ్మలుగా బతికిన ఇక్కడి గిరిజనులకు స్వాతంత్య్ర దినోత్సవం అంటే ఏమిటో తెలియదు. ప్రతీ ఏడాది మావోలు బ్లాక్ డేగా నిర్వహించడంతో ఎప్పుడూ జెండా ఎగరలేదు. దీంతో ఆ గ్రామంలో 155 బెటాలియన్ బీఎస్ఎఫ్ జవాన్లు స్వాతంత్య్ర దినోత్సవం గురించి సోమవారం అవగాహన కల్పించారు. గ్రామంలోని పాఠశాల వద్ద విద్యార్థులు, మరియు మహిళలకు జాతీయ జెండాలు అందజేసి పవిత్రతను తెలియజేశారు. ఈ గ్రామంలో తొలిసారి స్వాతంత్య్ర వేడుకలు మంగళవారం జరపనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో 155 బెటాలియన్ కంపెనీ కమాండార్ దీపాక్ తివారీ తదితరులు పాల్గొన్నారు.

- మల్కన్‌గిరి

ఎందరో మహానుభావులు..!



స్వాతంత్ర్య ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించిన ఆంధ్ర భాషాభివర్ధిని సమాజం భవనం

● స్వాతంత్య్ర ఉద్యమంలో ఆంధ్ర భాషాభివర్ధిని సమాజం

బరంపురం:

ఎంతోమంది త్యాగఫలం మన భారత స్వాతంత్య్రం. దేశ స్వాతంత్య్ర పోరాటంలో స్థానిక గిరి మార్కెట్ రోడ్‌లో 1909లో తెలుగు మహనీయులు స్థాపించిన ఆంధ్ర భాషభివర్థిని సమాజం ముఖ్య భూమిక పోషించింది. తెల్ల దొరల తుపాకీల ముందు రొమ్ము విరిచుకొని నిలబడి ప్రత్యేక గుర్తింపు పొందింది. గాంధీ మహాత్ముని పిలుపు దేశం మొత్తాన్ని ప్రభావితం చేసినట్లే విశాఖ, గంజాం జిల్లాలను సైతం ప్రభావితం చేసింది. ఈ సంగ్రామంలో గంజాం జిల్లా బరంపురంలోని ఆంధ్ర భాషాభివర్ధిని సమాజం తరుపున వేలాది మంది యువతీ యువకులు దేశం కోసం ప్రాణలర్పించేందుకు ముందుకొచ్చారు. 1921లో గాంధీజీ బరంపురం విచ్చేసి ఉత్తేజపూరిత ఉపన్యాసం చేశారు. దీంతో బరంపురంలో వరహాగిరి జోగయ్య పంతులు న్యాయవాద వృత్తిని వదిలి ఉద్యమంలోకి ప్రవేశించారు. అలాగే న్యాయపతి నారాయణమూర్తి జీవితమే ఉద్యమంగా సాగించి వందేమాతరం నినాదంతో ఉద్యమంలో పాల్గొన్నారు. ఇదే సంవత్సరంలో మద్రాసులో న్యాయవాద వృత్తిలో ఉన్న వి.వి.గిరి (మాజీ రాష్ట్రపతి) వృత్తిని వదిలేసి స్వరాజ్య ఉద్యమంలో పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు. వీరితో పాటు స్త్రీలు సైతం ఆంధ్ర మహిళా సమాజం ద్వారా ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఎల్లాయి సూరమ్మ, జయంతి సూరమ్మ, పూడిపెద్ది రమణమ్మ, మంత్రాల సీతమ్మ, ఆదుర్తి లక్ష్మీబాయమ్మ వంటివారు చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జయపురం: ఈనెల 12వ తేదీన కత్తిపోటుకు గురై చికిత్స పొందుతున్న బిపిన్ బహదూర్ మృతి చెందినట్లు పట్టణ పోలీసులు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 12వ తేదీ రాత్రి 10.15 గంటల సమయంలో జయపురం వెటనరీ కాలనీకి చెందిన జక్సా బహదూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన సోదరుడు బిపిన్ బహదూర్(42) డ్యూటీకి వెళ్తున్న సమయంలో ఫవర్ హౌస్ స్టాక్ యార్డు దగ్గర ప్రత్యూష్ దాస్ అనే వ్యక్తి టాటా ఫైనాన్స్ రుణం క్లియర్ చేసే విషయంలో తన సోదరుడు బిపిన్ బహదూర్‌ను కత్తితో పొడిచాడని తెలియజేసినట్లు పేర్కొన్నారు. వెంటనే బిపిన్‌ను జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారని, పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి విశాఖపట్నం మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లారని వెల్లడించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ బిపిన్ మరణించినట్లు తెలిసిందన్నారు. పరారీలో ఉన్న నిందితుడు ప్రత్యూష్ దాస్ కోసం దర్యాప్తు నిర్వహిస్తున్న తెలియజేశారు.

కొరాపుట్‌కు విచ్చేసిన ముగ్గురు మంత్రులు



మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వయ్‌తో బీజేడీ నాయకులు



మంత్రి తుషార్ కాంతీ బెహరతో ఎస్‌డీసీ చైర్మన్ చంద్రశేఖర్ మజ్జి తదితరులు

కొరాపుట్:

జిల్లా కేంద్రానికి ముగ్గురు మంత్రులు సోమవారం విచ్చేశారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో వీరు బీఎస్ఎఫ్ క్యాంప్‌లో దిగారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్య అతిథులుగా వీరు మూడు జిల్లాలకు వెళ్లారు. కొరాపుట్ జిల్లాకు రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి రణేంద్ర ప్రతాప్ స్వయ్, మల్కన్‌గిరి జిల్లాకు క్రీడామంత్రి తుషార్ కాంతి బెహరా, పౌర సరఫరాల శాఖ మంత్రి అతున్ సవ్యసాచి రాయగడ జిల్లాకు వెళ్లారు. వీరు ముగ్గురు ఒకే హెలికాప్టర్‌లో రావడంతో హెలిప్యాడ్ వద్ద నాయకులు ఘన స్వాగతం పలికారు. మంత్రులను కలిసినవారిలో పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాడీ, స్వాతంత్య్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ చంద్ర శేఖర్ మజ్జి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలక తదితరులు ఉన్నారు.

17 మంది పోలీసులకు పతకాలు

భువనేశ్వర్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రానికి చెందిన 17 మంది పోలీసులను పతకాలతో సత్కరించినట్లు కేంద్రం హోం మంత్రిత్వ శాఖ సోమవారం ప్రకటించింది. అందులో నలుగురు అధికారులు పోలీసు మెడల్ ఫర్ గ్యాలంటరీ (పీఎంజీ) అందుకున్నారు. విశిష్ట సేవల గుర్తింపుగా మరో ఇద్దరికి రాష్ట్రపతి పోలీసు పతకాలు ప్రదానం చేశారు. మిగిలిన 11 మంది పోలీసు అధికారులకు మెరిటోరియస్ సర్వీస్ పతకాలు లభించాయి. మొత్తం దేశవ్యాప్తంగా 954 మంది పోలీసు సిబ్బందికి మెడల్స్ లభించాయి.

అవార్డులు అందుకున్న ఒడిశా పోలీసు అధికారులు

● గ్యాలంటరీ పోలీసు పతకం

ప్రహ్లాద్ హిమిరిక (సుబేదార్), సంతోష్ కుమార్ గురు (ఎస్ఐ), సునీల్ కుమార్ బొరిహ (కమాండో), సుజిత్ కుమార్ రాణా (సిటి)

● విశిష్ట సేవా పతకం

సంజయ్ కుమార్ (ఏడీజీపీ), రవీంద్రనాథ్ శత్పతి (అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్)

● పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్

డాక్టర్ దీపక్ కుమార్ (ఐజీ ఆఫ్ పోలీస్, నార్తర్న్ రేంజ్, సంబల్‌పూర్), అనంత చరణ్ పతి (అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, భువనేశ్వర్), బేణుధర్ నాయక్ (అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, కటక్), రాజీబ్ లోచన్ పండా (ఎస్‌డీపీఓ బరంపురం టౌన్, బరంపురం), అమిత త్రిపాఠి (డీఎస్పీ విజిలెన్స్, భువనేశ్వర్ డివిజన్), కృష్ణ చంద్ర మొహంతా (సీఐ, హవల్దార్ ఆఫ్ పోలీస్), పీటర్ టిర్కీ (కానిస్టేబుల్, పోలీస్ రిజర్వ్ ఆఫీస్, దేవ్‌గడ్), గుప్త ప్రసాద్ మహంతి (అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఖుర్దా), దిలీప్ కుమార్ నాయక్ (సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్–ఆర్మ్‌డ్, సంబల్‌పూర్), సుశాంత కుమార్ మాఝీ (కానిస్టేబుల్, భువనేశ్వర్) మరియు ఉమాకాంత ప్రధాన్ (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, భువనేశ్వర్, ఖుర్దా) మెరిటోరియస్ సేవల పోలీస్ పతకానికి ఎంపికయ్యారు.

56 మందికి అవార్డులు

భువనేశ్వర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అగ్నిమాపక సేవలు, హోంగార్డులు (హెచ్‌జీ), పౌర రక్షణ (సీడీ)లో పతకాలు సాధించినవారి జాబితా సోమవారం ప్రకటించింది. మంగళవారం జరగనున్న రాష్ట్ర స్థాయి వేడుకల్లో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ పతకాలు బహూకరించి విజేతలకు సత్కరిస్తారు. విశిష్ట సేవల వర్గం కింద ముగ్గురు అగ్నిమాపక సిబ్బంది ఎంపిక కాగా, 5 మంది హోంగార్డు వాలంటీర్లు, 1 పౌర రక్షణ (సీడీ) కార్యకర్త ఎంపికయ్యారు. వీరితో పాటు 29 మంది అగ్నిమాపక సిబ్బంది డీజీ డిస్క్ మరియు కమెండేషన్ సర్టిఫికేట్, 13 మంది హోంగార్డులు బ్రాంజ్ డిస్క్ మరియు కమెండేషన్ సర్టిఫికేట్ మరియు 5 మంది సివిల్ డిఫెన్స్ వాలంటీర్లను బ్రాంజ్ డిస్క్ సర్టిఫికేట్ కోసం ఎంపిక చేయడం విశేషంవీరందరు ముఖ్యమంత్రి చేతుల మీదుగా హెచ్‌జీ మరియు సీడీ మెరిటోరియస్ సర్వీస్ పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకుటున్నారు.

● ఫైర్ సర్వీస్ మెరిటోరియస్ మెడల్‌కు ఎంపికైనవారు

కాళీ చరణ్ సబర్ (లీడింగ్ ఫైర్‌మెన్)
బిపాదొభంజన్ బెహెరా (డ్రైవర్ కానిస్టేబుల్)
నకుల్ నాయక్ (డ్రైవర్ కానిస్టేబుల్)

● హోంగార్డు మెరిటోరియస్ సర్వీస్ మెడల్‌కు ఎంపికైనవారు

ప్రతాప్ చంద్ర ఖండువాల్ ,బాబులీ హతి
ఉమేష్ నాయక్ ,ప్రమోద్ కుమార్ సాహు
బిపిన్ బిహారీ బిస్వాల్

● సివిల్ డిఫెన్స్ సర్వీస్ మెడల్

ప్రమోద్ కుమార్ దొలై (సివిల్ డిఫెన్స్ వాలంటీర్)

ఐదుగురు దొంగలు అరెస్టు



పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న సామాన్లు చూపిస్తున్న పోలీసులు

జయపురం: ఒక ప్రభుత్వ ఫార్మ్ హౌస్‌లో విలువైన సామాన్లు దొంగలించిన ఐదుగురు వ్యక్తులతో పాటు వాటిని కొనుగోలు చేసిన దుకాణదారుడిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర్ చంద్ర తండి సోమవారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రొండాపల్లిలోని ప్రభుత్వ ఫార్మ్ సీడ్ ఉత్పాదన ఫార్మ్ హౌస్ కొంతకాలంగా వినియోగంలో లేదు. ఫార్మ్ హౌస్‌కు ఒక కాపలాదారు ఉన్నాడు. అయినా ఆ ఫార్మ్‌హౌస్ స్టోర్ రూమ్‌లో దొంగతనం జరిగింది. ఫార్మ్ ఉద్యోగి మనోజ్ కుమార్ బెహర జూలై 29వ తేదీన సామానులు పరిశీలిస్తుండగా కిటికీలు, తలుపులు, పవర్ టిల్లర్, గడ్డి కోసే మిషన్, ఇనుప గ్రిల్, గేట్‌తో పాటు పలు సామాన్లు దొంగతనానికి గురైనట్లు కనుగొన్నారు. దొంగతనంపై బెహర లిఖితపూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దొంగతనం చేసిన రొండాపల్లి గ్రామానికి చెందిన శివ పొరజ(21), పాతరొగుడ గ్రామానికి చెందిన డొంబు జాని(23), టంకుగుడ గ్రామానికి చెందిన హరిహర హరిజన్ (19), రతఖండిగుడ గ్రామానికి చెందిన రామనా మినియాక (22), రాజేష్ పొరజ ఉరఫ్ ముదులి(19)లతో పాటు దుకాణదారు ఎస్.వినోద్ (22)లను అరెస్టు చేశారు. అలాగే దొంగతనానికి గురైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

గజపతిలో గెలుపే లక్ష్యం

● మంత్రి అతాను సవ్యసాచి నాయక్

● పర్లాకిమిడిలో బీజేడీ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి అతాను సవ్యసాచి నాయక్

పర్లాకిమిడి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గజపతి జిల్లాలోని రెండు అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని మంత్రి అతాను సవ్యసాచి నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక కాలేజీ రోడ్డులో బిజూ జనతా దళ్ పార్టీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో మోహనా, పర్లాకిమిడి నియోజకవర్గాల్లో తప్పనిసరిగా మన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. అనంతరం బీజేడీ జిల్లా అధ్యక్షుడు జగబంధు దాస్, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులను మంత్రి అతాను సవ్యసాచి నాయక్‌కు పరిచయం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ నాయక్, ఎస్డీసీ చైర్మన్ మరియం రైయితో, మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, టౌన్ ప్రెసిడెంట్ సుధీర్ మహాపాత్రో, నాయకులు తిరుపతి పాణిగ్రాహి, బసంత్ దాస్, రూపేష్ పాణిగ్రాహి, కాశీనగర్ సమితి చైర్మన్ బల్ల శాయమ్మ, గుసాని సమితి చైర్మన్ ఎస్.వీర్రాజు, ఎస్ఏసీ చైర్మన్ మేడిబోయిన సుధారాణి, శాసనం లింగరాజు, బసంత్ దాస్, యువరాణి కల్యాణీ దేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వాతంత్ర్య వేడుకలకు వ్యవసాయ కూలీకి ఆహ్వానం


అక్షయ్ జైపుల్

కొరాపుట్: దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని కొరాపుట్ జిల్లాకు చెందిన నిరుపేద కూలీకి ఆహ్వానం అందింది. ఈ మేరకు సోమవారం కొరాపుట్ జిల్లా కేంద్ర ఉన్నతాధికారులకు అత్యవసర ఆదేశాలు వచ్చాయి. కొరాపుట్ జిల్లా కోట్‌పాడ్ సమితి చందిలి గ్రామ పంచాయతీ తిరింజి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ అక్షయ్ జైపుల్‌ని అత్యవసరంగా న్యూఢిల్లి తీసుకొని రమ్మని ఆదేశాలు వచ్చాయి. అక్షయ్ వ్యవసాయ కూలీగా ఉంటూ ఆ ప్రాంతంలో అనేక చెరువుల మరమ్మతులు చేయించారు. దీంతో ఆయనకు పిలుపు వచ్చింది. వేడుకలకు అక్షయ్ భార్యతో కలసి బయల్దేరారు.

పరామర్శకు వెళ్తే పొడిచేశాడు..

- మహిళ పరిస్థితి విషమం


గాయపడిన కిరణ్మయి

సాలూరు: గాయాలపాలైన స్నేహితురాలిని పరామర్శించేందుకు వెళ్లిన ఓ మహిళపై దాడి జరిగిన సంఘటన సాలూరు పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితురాలు కిరణ్మయి, తండ్రి ఈశ్వర రావు, స్థానికులు తెలియజేసిన వివరాల మేరకు... పట్టణంలోని చిట్లువీధిలో నివసిస్తున్న లలిత కుమారి రామభద్రపురం మండలం తారాపురం యూపీ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తోంది. ఆమెకు భర్త ప్రసాద్‌తో విభేదాలుండడంతో ఇరు కుటుంబాల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఇటీవల లలితకుమారిపై ప్రసాద్ దాడిచేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న కిరణ్మయి స్నేహితురాలిని పరామర్శించేందుకు సోమవారం లలిత కుమారి ఇంటికి వెళ్లింది. ఈ సమయంలో లలితకుమారి భర్త ప్రసాద్ రావడంతో అతనికి, కిరణ్మయికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో సహనం కోల్పోయిన ప్రసాద్ కిరణ్మయి పొట్టపై కత్తితో దాడి చేసాడు. తీవ్ర రక్తస్రావంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిన కిరణ్మయిని స్థానికులు 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం ఆస్పత్రికి రిఫర్ చేశారు. పట్టణ సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందాల రాయళ్ల అరెస్టు

- రూ.12,470 స్వాధీనం

గంట్యాడ: మండలంలోని కొత్త వెలగాడ గ్రామంలో కోడి పందాలు ఆడుతున్న కొంత మందిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గ్రామంలో కోడి పందాలు ఆడుతున్నట్లు మహిళాపోలీస్ గంట్యాడ పోలీసులకు సమాచారమందించడంతో గ్రామంలో పోలీసులు మాటు వేసి కోడి పందాలు ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.12,470, మూడు కోండి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎక్కడైనా కోడి పందాలు, పేకాట ఆడినట్లయితే చర్యలు తీసుకుంటామని ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఎరువుల షాపు సీజ్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద నారాయణపట్నంలో గల శ్రీ మణికంఠ రైతు డిపో ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఎరువులు, పురుగు మందుల నిలవ్వలు, రికార్డులను పరిశీలించారు. ఈ క్రమంలో రూ.4,20, 832 విలువ చేసే ఎరువుల నిల్వల్లో వ్యత్యాసాలు కనిపించడంతో షాపును సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలం, ఏఓ పూర్ణిమ, ఏఈఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం


చికిత్సపొందుతున్న పోలినాయుడు

పార్వతీపురం: సీతానగరం మండలం జోగింపేటకు చెందిన జాగాన పోలినాయుడు గుట్కాలు తినడం కారణంగా నోట్లో పుండ్లు ఏర్పాడ్డాయి. అలాగే ముఖం అందవికారంగా ఉందని భావించి మనస్తాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం భార్య ఆదిలక్ష్మి గమనించి కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి 108 వాహనం ద్వారా చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బెదిరించేందుకు మహిళ..


చికిత్స పొందుతున్న అపర్ణ

పార్వతీపురం: కుటుంబసభ్యులను బెదిరించేందుకు సీతానగరం మండలం గుచ్చిమి గ్రామానికి చెందిన మండల అపర్ణ మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. భర్త రామకృష్ణ, అత్తమ్మ చూస్తుండగానే వారిని భయపెట్టేందుకు ఇంట్లో ఉన్న మాత్రలు ఒక్కసారిగా మింగేసింది. దీంతో కుటుంబసభ్యులు ఆటోలో ఆమెను చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

స్వాతంత్ర్య వేడుకకు సన్నద్ధం

రాష్ట్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సర్వం సన్నద్ధమైంది. ఈ మేరకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు అన్ని ఇళ్లపై త్రివర్ణ పతాకం ఎగిరేలా చర్యలు తీసుకుంటున్నారు. పలుచోట్ల జాతీయ జెండాలతో సోమవారం ర్యాలీలు నిర్వహించారు. రైల్వేస్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలను త్రివర్ణ శోభితంగా అలంకరించారు. – సాక్షి నెట్‌వర్క్


జయపురం: పట్టణ ప్రధాన కూడలిలో విద్యుత్ దీపాల కాంతుల్లో త్రివర్ణ పతాకం


రాయిగడ రైల్వేస్టేషన్‌లో విద్యుత్ దీపాల అలంకరణ



కొరాపుట్ రైల్వేస్టేషన్‌లో విద్యుత్ దీపాల అలంకరణ


మల్కన్‌గిరి: మత్తిలిలో భారీ జాతీయ జెండా ప్రదర్శన


బరంపురం: కోర్టుపేట జంక్షన్‌లో జాతీయ జెండాలు కొంటున్న చిన్నారి


బరంపురం: దిగపండి బ్లాక్‌లో జెండాలు కుడుతున్న మహిళలు


జయపురం: బొయిపరిగుడలో మారథాన్ నిర్వహిస్తున్న దృశ్యం


కొరాపుట్: సిమిలిగుడ కాలేజీ జంక్షన్ వద్ద ర్యాలీ

తూర్పుకోస్తా రైల్వేలో మరో ముందడుగు

- ఖుర్దా రోడ్‌లో అత్యాధునిక రైలు నిర్వహణ కేంద్రం ఏర్పాటు
- ప్రారంభించిన రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్
- తేజస్ కోచ్‌లతో రాజధాని ఎక్స్‌ప్రెస్ పరుగులు

భువనేశ్వర్:

తూర్పు కోస్తా రైల్వే సరికొత్త సౌకర్యాలతో మరోసారి ముందంజలో నిలిచింది. ఈ జోన్ నాభి కేంద్రం ఖుర్దారోడ్ మండలం ప్రధాన కార్యాలయంలో అత్యాధునిక రైలు నిర్వహణ కేంద్రాన్ని (టీఎంసీ) రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సోమవారం ప్రారంభించారు. భువనేశ్వర్, న్యూఢిల్లీ మధ్య రవాణా అవుతున్న రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలుకు తేజస్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌లను జోడించారు. ఈ సందర్భంగా భువనేశ్వర్ రైల్వేస్టేషన్ మరియు ఖుర్దారోడ్ డీఆర్ఎం కార్యాలయాల్లో రెండు వేర్వేరు కార్యక్రమాల్లో రైల్వే శాఖ మంత్రి పాల్గొన్నారు. ఆయనతో కేంద్ర విద్య మరియు నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, భువనేశ్వర్ సెంట్రల్ ఎమ్మెల్యే అనంత్ నారాయణ్ జెనా, ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ, ఖుర్దారోడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ హెచ్.ఎస్ బజ్వా ఉన్నారు.


టీఎంసీ ప్రారంభిస్తున్న రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

తేజస్ కోచ్‌లతో...

తేజస్ కోచ్‌లతో ఉన్నతి చెందిన భువనేశ్వర్ - న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలుని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో రైల్వే రంగానికి రూ.10,012 కోట్లను కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 25 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. కటక్, భువనేశ్వర్ మరియు పూరి రైల్వేస్టేషన్లలో అత్యాధునిక సౌకర్యాలతో పురోగతి పునరాభివృద్ధికి ఉదాహరణగా మంత్రి పేర్కొన్నారు. తేజస్ కోచ్‌లతో కూడిన రాజధాని ఎక్స్‌ప్రెస్‌ని నడపడం వల్ల మెరుగైన సౌకర్యాలతో కూడిన రైలు ప్రయాణ అనుభవంలో కొత్తయుగం ఆవిష్కృతమైందని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.

భువనేశ్వర్ రైల్వేస్టేషన్ పర్యవేక్షణ

అంతకుముందు రైల్వేమంత్రి భువనేశ్వర్ రైల్వేస్టేషన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భువనేశ్వర్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధికి సంబంధించిన నిర్మాణ పనులను సమీక్షించారు. భువనేశ్వర్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విభజన భయానక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను మంత్రులిద్దరూ సందర్శించారు.

టీఎంసీ ఉపయోగాలు

ఖుర్దారోడ్ డీఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన టీఎంసీ వలన ఖుర్దా రోడ్ ట్రైన్ మేనేజ్‌మెంట్ సెల్ నుండి రియల్ టైమ్ రైలు పొజిషన్ తెలుసుకోవడం సాధ్యమవుతుంది. గతంలో రైలు రాక, పోక నివేదికల కోసం స్టేషన్ సిబ్బందిపై ఆధారపడాల్సి వచ్చేది. కానీ టీఎంసీ వలన రైలు రవాణాలో వైఫల్యాల వివరాలు ప్రత్యక్షంగా ఈ కేంద్రంలో ప్రదర్శితమవుతాయి. ప్యాసింజర్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ మరియు కోచ్ ఇండికేషన్ డిస్‌ప్లే వ్యవస్థని టీఎంసీతో అనుసంధానించారు. ప్లాట్‌ఫాంలోనికి ప్రవేశించబోయే రైలు వివరాల కోసం అనుబంధ వర్గాలతో విడివిడిగా సంప్రదింపులు లేకుండా ఇంటర్మీడియట్ స్టేషన్ల రెండు వేర్వేరు నియంత్రణ (కంట్రోల్) బోర్డుల సమన్వయంతో సకాల సమాచారాన్ని టీఎంసీ ప్రదర్శిస్తుంది. రైలు రన్నింగ్ సమాచారం మొత్తం స్క్రీన్‌పై ప్రదర్శించబడుతుంది.

త్వరలో రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్

- రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్

భువనేశ్వర్: రౌర్కెలా, భువనేశ్వర్ మార్గంలో త్వరలో రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును నడిపించనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సోమవారం తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో తేజస్ కోచ్‌లతో భువనేశ్వర్ - న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. రాష్ట్రంలో రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవల కార్యాచరణ దాదాపు ఖరారు అయ్యిందని పేర్కొన్నారు. రౌర్కెలా, సుందర్‌గఢ్, తాల్చేర్ మరియు అంగుల్ ప్రాంతాల గుండా రవాణా అవుతుందన్నారు. తొలి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవం పురస్కరించుకుని రాష్ట్రానికి మరో సెమీ హైస్పీడ్ రైలును ప్రవేశ పెట్టేందుకు హామీ ఇచ్చారు. ఆ వాగ్దానానికి కట్టుబడి, రెండో వందే భారత్ త్వరలో రూర్కెలా నుండి భువనేశ్వర్ మధ్య రాకపోకలు చేస్తుందని ప్రకటించారు. సరస్వతీ విద్యా మందిర్ పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులను పోటీల ద్వారా ఎంపిక చేసి ప్రారంభోత్సవ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ఉచితంగా ప్రయాణ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. వందే భారత్ వీడియో చూసిన విద్యార్థులకు ఒక పోటీ నిర్వహించబడుతుంది. పోటీలో ఎంపికైన 50 మంది విద్యార్థులకు విజేతలకు ప్రకటించి ఉచిత ప్రయాణం అవకాశం కల్పిస్తారని మంత్రి వివరించారు.

భయానక పరిస్థితులు పునరావృతం కారాదు


విభజన భయానక దృశ్యాల చిత్ర ప్రదర్శన సందర్శనలో ఐఐటీ డైరెక్టర్ శ్రీపాద కమల్కర్ తదితరులు

- ఐఐటీ డైరెక్టర్ శ్రీపాద కమల్కర్
- క్యాంపస్‌లో దేశ విభజన భయానక స్మరణ కార్యక్రమం

భువనేశ్వర్: దేశ విభజన సమయంలో నెలకొన్న భయానక పరిస్థితులు పునరావృతం కాకూడదని స్థానిక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) డైరెక్టర్ శ్రీపాద కమల్కర్ అన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశ విభజన భయానక స్మరణ దినం కార్యక్రమం ఐఐటీలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనని శ్రీపాద కమల్కర్ ప్రారంభించారు. చరిత్రను అధ్యయనం చేయడం ద్వారా అమానుష, హింసాత్మక ఇతరేతర మానవ విలువల వ్యతిరేక పరిస్థితులు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 1947 ఆగస్టు 14న భారతదేశం మరియు పాకిస్తాన్‌ల విభజన కారణంగా మానవ జనాభా అతిపెద్ద స్థానభ్రంశం సమయంలో, లక్షలాది మంది అనుభవించిన బాధలను గుర్తుంచుకోవడానికి, ప్రజల బాధలు మరియు త్యాగాలకు నివాళులర్పించడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. హింస మరియు మానవాళిని ప్రతికూలంగా ప్రభావితం చేసే చర్యలను మానుకోవాలని ఐఐటీ రిజిస్ట్రార్ వామదేవ్ ఆచార్య సూచించారు.

స్థానభ్రంశం బాధాకర చిత్ర ప్రదర్శన

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ (ఐసీహెచ్ఆర్) మరియు ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ) సంయుక్తంగా రూపొందించిన విభజన బాధాకర చిత్ర ప్రదర్శన సందర్శకులను చలింపజేసింది. భారత్ – పాక్ విభజనతో ఆనాడు తలెత్తిన మానవాళి వెతలను ఈ ప్రదర్శన ప్రతిబింబించింది. కార్యక్రమంలో డీన్ (విద్యార్థి వ్యవహారాలు) ప్రొఫెసర్ రాజేష్ రోషన్ దాష్, స్టూడెంట్ జింఖానా ఫ్యాకల్టీ అడ్వైజర్ (సోషియో కల్చరల్) డాక్టర్ కోదండ రామ్ మంగిపూడి పాల్గొన్నారు.

బైక్, ఆటో ఢీకొని యువతి మృతి


యువతి మృతదేహం


వసంతకుమారి (ఫైల్)

సీతంపేట/బూర్జ: సీతంపేట ఏజెన్సీలోని గొయిది గ్రామ సమీపంలో సోమవారం ఓ బైక్, ఆటో ఢీనండంతో జరిగిన ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం గుత్తవల్లికి చెందిన పైడి వసంతకుమారి (17) మృతిచెందింది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గుత్తవల్లి పక్కగ్రామానికి చెందిన యువకుడు కూన వెంకటేష్, వసంతకుమారి బైక్‌పై సీతంపేట వచ్చారు. తిరుగుప్రయాణంలో ద్విచక్రవాహనంపై ఇద్దరూ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో గాయాలపాలంగా యువతి అపస్మారక స్థితికి చేరుకుంది. ఇద్దరినీ 108లో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే యువతి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యువకుడు వెంకటేష్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఒక్కగానొక్క కుమార్తె మృతిచెందడంతో తల్లిదండ్రులు ఉమ, సత్యనారాయణ గుండెలవిసేలా రోదిస్తున్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే సహించం


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పాచిపెంట: మండలంలో పెద్దగెడ్డ నిర్వాసిత గ్రామం కొటికి పెంట ఇళ్ల సమస్యకు సంబంధించి తనపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. గోగాడవలసలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దగెడ్డ నిర్వాసిత గ్రామమైన కొటికి పెంట ఇళ్ల నిర్మాణానికి ఒక్కో నిర్వాసితునికి గతంలో ఐదు లక్షల రూపాయలు ఇప్పిస్తానని చెప్పానంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపై ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని హెచ్చరించారు. అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ కృషితో కొటికిపెంటను ముంపు గ్రామంగా గుర్తించడం, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.50వేల కేటాయించినట్టు తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి నిర్వాసితులు ముందుకురాకపోవడంతో డబ్బులు వెనుక్కువెళ్లిపోయాయన్నారు. సర్పంచ్, గ్రామస్తుల వినతి మేరకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని అప్పటి తహసీల్దార్ ఎం.వి.రమణమూర్తికి సూచించామని, ఆయన కేవలం 245 మందికి మాత్రమే ఇళ్ల స్థలాలు ఇవ్వగలమని తెలపగా, కలెక్టర్‌తో మాట్లాడి 283 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశామన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందజేస్తున్న రూ.లక్షా80 వేలు చాలవని, మరో రూ.లక్షమంజూరు చేయాలన్న గ్రామస్తుల వినతిని ప్రభుత్వానికి నివేదించామన్నారు. ప్రజలకు మంచి చేయలేని టీడీపీ నాయకులు ప్రతీ విషయాన్ని రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. జలాశయాల అభివృద్ధికి జైకా నిధులు మంజూరుకు కృషిచేసినది ఎవరో రైతులకు తెలుసన్నారు. సమావేశంలో ఎంపీపీ బర్నాన ప్రమీల, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు డోల బాబ్జి, పాచిపెంట వీరంనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయలు గౌరీశ్వరరావు, సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ కొల్లి రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

పార్వతీపురం: వివిధ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చి మొర పెట్టుకుంటున్న అర్జీదారుల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించాను. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 80 అర్జీలు అందాయి. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎంవీజీ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్ర రావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టి బాబు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి నాయక్, జిల్లా సరఫరా అధికారి శివప్రసాద్, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా పశు వైద్య అధికారి బి.శ్రీనివాస రావు, జిల్లా విద్యా శాఖ అధికారి ప్రేమ్ కుమార్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీస్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

ఒడిశా సెంచూరియన్‌కు నాక్ గుర్తింపు


టెక్కలి సెంచూరియన్‌లో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న వర్సిటీ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: ఒడిశా సెంచూరియన్ విశ్వ విద్యాలయానికి నాక్ ఏ ప్లస్ గుర్తింపు రావడం పట్ల వర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్‌ఎన్ రాజు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు టెక్కలి వర్సిటీలో సిబ్బందితో కలిసి సోమవారం వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొత్తం నాలుగు పాయింట్లకు గాను ఒడిశా సెంచూరియన్ విశ్వవిద్యాలయం 3.37 పాయింట్లు సాధించి నాక్ ఏ ప్లస్‌లో నిలించిందన్నారు. త్వరలో టెక్కలి క్యాంపస్‌కు కూడా నాక్ గుర్తింపు దక్కనుందని చెప్పారు.

బయటకు వచ్చిన టీడీపీ దాడి వీడియో

భామిని: మండలంలోని కొరమ గ్రామంలో పొలంలో పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకుల దాడి దృశ్యాల వీడియో బయటకు వచ్చింది. ఈనెల12వ తేదీన గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అగతముడి మోనరావు, అప్పలనాయుడు, వరలక్ష్మి, జానకి, మహేష్‌లపై దాడి జరగ్గా వారంతా తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. అయితే ఈ ఘటనలో దాడికి పాల్పడిన టీడీపీ నాయకుల దాష్టీకం, హత్యాయత్నం దృశ్యాలు బయటకు వచ్చాయి. ఈ మేరకు బాధితులు దాడి వీడియోలను పోలీసులకు అందజేశారు.

క్లుప్తంగా

వార్డు సభ్యుడు ఎన్నిక ఏకగ్రీవం



శ్రీనివాసరావుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి రవి

జి.సిగడాం: దవళపేట గ్రామ పంచాయతీ మూడో వార్డు సభ్యుడుగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు కంచరాన శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఎన్నికల రిట్నరింగ్ అధికారి అరసాడ రవి సోమవారం తెలిపారు. ఈనెల 9న వార్డు సభ్యుని పదవి కోసం శ్రీనివాసరావు ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. పరిశీలించిన అనంతరం ఏకగ్రీవంగా ఆయన ఎన్నికైనట్లు వెల్లడించారు. ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ పేడాడ శ్రీరామమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బూరాడ వెంకటరమణ, నాయకులు కంచరాన రమణారావు, బొడ్డేపల్లి ఉదయ్‌కుమార్, సూరన్నాయుడు. పంచాయతీ కార్యదర్శి స్వాతి ఉన్నారు.

పాఠశాలకు ఇన్వెర్టర్ అందజేత



ఇన్వెర్టరు అందజేస్తున్న వార్డు సభ్యుడు శ్రీను

లావేరు: మురపాక గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు మజ్జి శ్రీను తన సొంత నిధులతో మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్సియల్ స్కూల్‌కు ఇన్వెర్టర్‌ను సమకూర్చారు. విద్యుత్ సరఫరా లేని సమయంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్కూల్ పీఎంసీ చైర్మన్, మురపాక గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తేనేల సురేష్‌కుమార్ దృష్టికి తల్లిదండ్రులు దృష్టికి తీసుకువెళ్లారు. విద్యార్థి తండ్రి అయిన వార్డు మెంబరు శ్రీను స్పందించి రూ. 18 వేల విలువ గల ఇన్వెర్టరును కొనుగోలు చేసి పాఠశాల ప్రిన్సిపాల్ బొత్స ప్రసాద్‌కు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తేనేల సురేష్‌కుమార్, ఏపీజీబీవీ మాజీ ఉద్యోగి గొర్లె వెంకటరమణ, పేరూరి కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

జి.సిగడాం: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ సూచించారు. జి.సిగడాంలోని మోడల్ పాఠశాలలోని ఉపాధ్యాయులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు, క్రీడా రంగాల్లో రాణించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ పాఠశాల సిబ్బంది వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, పిచ్చిక నేతాజీ, జి.సిగడాం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శీర రాము, రామకృష్ణ ఉన్నారు.

అక్రమ లేఅవుట్‌పై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో 129 సబ్ డివిజన్ పరిధి సర్వేనంబర్ 126/1లో వేసిన అక్రమ లేఅవుట్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మొదలవలస చిరంజీవి కోరారు. ఈ మేరకు ఎచ్చెర్ల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో తహసీల్దార్ వై.సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో కూడా ఫిర్యాదు చేసినట్లు చిరంజీవి తెలిపారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్‌బాబా, నేతింటి సత్యనారాయణ ఉన్నారు.

బ్యూటీషియన్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఇవ్వనున్న 30 రోజులు బ్యూటీషియన్ కోర్సుకు మహిళా అభ్యర్థులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి కల్పించనున్నట్లు చెప్పారు. పదో తరగతి విద్యార్హత, 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు దరకాస్తు చేసుకోవడానికి అర్హులు. పూర్తి వివరాలకు 95534 10809, 79933 40407 నంబర్లను సంప్రదించాలని సూచించారు.





స్వాతంత్య్ర ఉద్యమ సమయంలో విప్లవాగ్ని రేపిన గురుతులు నేటికీ సిక్కోలులో సజీవంగా ఉన్నాయి. నరనరాన స్వాతంత్య్ర కాంక్షను రగిలించిన ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. మహాత్ముడు తిరుగాడిన ప్రదేశాలు, పుల్లెల శ్యామసుందరుడు చేసిన పోరాటాలు, స్వేచ్ఛ కోసం నాడు జరిగిన ఉద్యమాలు నేటికీ స్ఫూర్తిని అందిస్తున్నాయి. ఆ స్వాతంత్య్ర స్ఫూర్తిని అందుకుంటూ పంద్రాగస్టు వేడుక జరుపుకునేందుకు సిక్కోలు సర్వ సన్నద్ధమవుతోంది. అందులో భాగంగానే ఊరూవాడా ర్యాలీలు, జాతీయ జెండా ఆకృతులు, వినూత్న కార్యక్రమాలు జోరుగా జరిగాయి.

నిత్యనూతన స్ఫూర్తి..

స్వాతంత్య్ర కీర్తి

● మువ్వన్నెల వెలుగు

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో రైల్వే అధికారులు మూడు రంగుల కాంతుల్లో త్రివర్ణ పతాకాన్ని ఏర్పాటుచేశారు. ఇది ప్రయాణికులను ఆకట్టుకుంటోంది.



ఆమదాలవలస రైల్వేస్టేషన్ ఆవరణలో రంగుల కాంతిలో త్రివర్ణ పతాకం



● బంగారు పతాకం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ గాంధీనగర్‌కు చెందిన సూక్ష్మ కళాకారుడు రమేష్ ఆచారి సోమవారం అతి సూక్ష్మ బంగారు జాతీయ జెండాను తయారు చేశాడు. సుమారు నాలుగు గంటల సమయం కష్టపడి 0.50 మిల్లీ గ్రాముల బంగారం ఉపయోగించి అరసెంటీమీటరు ఎత్తులో ఉన్న జెండా రూపొందించాడు. బొటన వేలిపై పట్టే ఈ ఆకృతిని చూసి స్థానికులు ఆయనను అభినందించారు.



గోటిపై బంగారు త్రివర్ణపతాకం

● వీధుల గుండా.. జాతీయ జెండా



టెక్కలి: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం టెక్కలిలో 360 అడుగుల జాతీయ జెండాను ఊరేగించారు. స్థానిక ఎస్‌వీఆర్‌కే, విశ్వజ్యోతి విద్యార్థులు పాల్గొన్నారు.

అఖిల భారత విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో టెక్కలిలో 360 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు





● ఐక్య భారతం

రణస్థలం: సర్వమత సమానత్వం భారతీయ సూత్రం. రణస్థలంలో ముగ్గురు స్నేహితులు అలాంటి ఐక్యతను చాటారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హిందువు డి.రామకృష్ణ, ముస్లీం తాజ్‌హుద్దీన్, క్రిస్టియన్ శ్యాంబాబులు తమ మతాచారాల దుస్తుల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కృతం చేశారు.

● ఏర్పాట్ల పరిశీలన

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో స్వాతంత్య్ర వేడుకలకు చేస్తున్న ఏర్పాట్లను జిల్లా అధికారులు సోమవారం పరిశీలించారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ ఎం.నవీన్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి బి.శాంతి, తహసీల్దార్ ఎన్.వెంకటరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా పథక సంచాలకులు డాక్టర్ డీవీ విద్యాసాగర్, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ ఏపీసీ డాక్టర్ ఆర్.జయప్రకాష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు. ఆదివారం రాత్రి కురిసిన తేలిక పాటి వర్షం పనులకు అంతరాయం, శకటాల పనులకు ఆటంకం కలిగించింది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జేసీ నీవన్, తదతరులు



77 ఆకారంలో కూర్చున్న అవలింగి జేబీటీ పాఠశాల విద్యార్థులు



స్వాతంత్య్ర దినోత్సవాల్లో భాగంగా ఏర్పాట్లు



● సైకత స్ఫూర్తి

ఆమదాలవలస రూరల్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గాజులకొల్లివలస గ్రామం సమీపంలోని సంగమేశ్వర ఆలయం వద్ద గేదెల హరికృష్ణ సైకత శిల్పాన్ని తీర్చిదిద్దారు. పార్లమెంట్ భవనాన్ని కూడా పొందుపరిచారు. ఈ శిల్పం ఆకట్టుకుంటోంది.

● మహాత్ముని చూసి.. మురిసిన దూసి

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస మండలం దూసి గ్రామ పంచాయతీ పరిధిలో గల దూసి రైల్వే స్టేషన్‌కు ఓ ప్రత్యేకత ఉంది. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో దూసి రైల్వేస్టేషన్‌కు మహాత్ముడు వచ్చాడు. అప్పట్లో ఉద్యమాలు రాత్రి సమయాల్లో చేపట్టేందుకు రహస్య సమావేశాలు జరిపేవారు. ఈ ఉద్యమం గురించి స్వాతంత్య్ర ఉద్యమకారులను సంఘటితం చేసేందుకు గాంధీజీ దేశంలో అన్ని ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించేవారు. అలాంటి సమావేశం దూసి రైల్వేస్టేషన్‌లో చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో బొగ్గుతో నడిచే రైలులో గాంధీజీ ప్రయాణం చేసి దూసి రైల్వే స్టేషన్‌లో కాసేపు నిలిచి ఉద్యమం గురించి ప్రజలను చైతన్యవంతులను చేశారు. గాంధీజీ రైల్వేస్టేషన్‌కు వస్తున్నారని గ్రామాల్లో తెలియడంతో చాలా మంది స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అయితే గాంధీజీ రైలు భోగీ నుంచే ప్రసంగించినట్లు గ్రామాల్లోని ప్రజలు చెబుతుంటారు. అలాగే ఆయన ఇక్కడ ఓ మర్రి మొక్క నాటినట్లు కూడా చెబుతుంటారు. అందుకే ఈ స్టేషన్‌కు గాంధీ రైల్వేస్టేషన్‌గా పేరుపెట్టాలని పలువురు కోరుతున్నారు.



గాంధీజీ అడుగుపెట్టిన దూసి రైల్వేస్టేషన్ (ఫైల్)

● ఆ స్మృతుల్లో..

ఇచ్ఛాపురం: స్వాతంత్ర్యోద్యమంలో ఇచ్ఛాపురం పాత్ర కూడా ఉంది. ఈ ప్రాంతానికి చెందిన పుల్లెల శ్యామ్‌సుందర్‌రావు మన తొలి స్వతంత్ర్య వీరుడు. స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్న ఆయన నాలుగు మార్లు జైలు శిక్ష అనుభవించారు. 1940లో గృహ నిర్బంధంలో ఉంటూ అమరులయ్యారు. ఇచ్ఛాపురం పట్టణంలోని పంజావీధిలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఆయన స్మృతి చిహ్నం ఉంది.



మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పుల్లెల శ్యామ్ సుందరరావు చిత్రపటం



పంజావీధి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్మృతిచిహ్నం

● మహాత్ముడి గుడి

శ్రీకాకుళం కల్చరల్: బాపూ నడిచిన బాటను అందరికీ పరిచయం చేయడానికి, ఆ మహాత్ముని పోరాట పటిమ అందరికీ వివరించడానికి శ్రీకాకుళంలో ఏకంగా గుడినే నిర్మించారు. శ్రీకాకుళం శాంతినగర్ కాలనీలో గాంధీ స్మారక నిధి బృందం పర్యవేక్షణలో గాంధీ గుడి, స్వాతంత్య్ర సమరయోధుల స్మృతి వనం రూపుదిద్దుకుంది. 2021 జనవరి 30న గాంధీ గుడిని ప్రారంభించారు. అదే ప్రాంగణంలో స్వాతంత్య్ర పోరాటంలో త్యాగాలు చేసిన సమరయోధులతో పాటు ప్రపంచాన్ని ప్రభావితం చేసిన సంఘ సంస్కర్తల ప్రతి రూపాలను ప్రతిష్ఠించారు. ఆ ప్రాంతంలో అడుగుపెడితే ఒక వైపు గాంధీ గుడి, ధ్యాన ముద్రలో ఉన్న మహాత్ముడు దర్శనమిస్తాడు. ఇక్కడే జాతీయ జెండాను 105 అడుగుల ఎత్తులో ప్రతిష్ఠిం



స్మృతివనంలో ప్రతిష్ఠించిన గాంధీ గుడి

భారత మాతకు జేజేలు

కవిటి: మండలంలోని సీహెచ్ కపాసుకుద్ది మత్స్యకార గ్రామంలో భారత మాతను ఆరాధ్య దైవంగా కొలుస్తున్నారు. ఊరి ప్రారంభంలో ఆలయాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. స్వాతంత్య్ర పోరాట కాలం నుంచి ఇక్కడ భారతమాతను గ్రామస్తులు పూజిస్తున్నారు.



అనాథని అక్కున చేర్చుకుని..

శ్రీకాకుళం క్రైమ్: అతనికి ఎండ, వాన, చలి తీవ్రత ఏమీ చేయదు.. రోడ్డు మీదే తిరుగుతూ.. ఏది దొరికితే అది తింటూ.. గత 15 ఏళ్లుగా డేఅండ్ నైట్ కూడలి సమీపంలోనే అనాథగా జీవిస్తున్నాడు. సోమవారం పెరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలించి అటుగా వస్తున్న జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అతన్ని చూశారు. వెంటనే రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగిరెడ్డి లక్ష్మణరావును ఆ వ్యక్తిని స్వచ్ఛంద సేవా సంస్థకు తరలించాలని ఆదేశించారు. ఎస్ఐ దగ్గరుండి అనాథకు స్నానం చేయించి.. దుస్తులు వేయించి కలెక్టరేట్ సమీపంలోని మథర్ థెరీసా స్వచ్ఛంద సేవా సంస్థలో చేర్పించారు. దీనిపై ఎస్ఐ లక్ష్మణరావు మాట్లాడుతూ రాయగఢలోని కంద్రవీధికి చెందిన హరికృష్ణ బెహరా అనే వృద్ధుడు గత 15 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాడన్నారు. ఎవరైనా ఏదైనా ఇస్తే తప్ప.. అడిగి తీసుకోడని, సత్యసాయి సేవా సమితివారు ఒకపూట భోజనం పంపిస్తుంటారని చెప్పారు.



డే అండ్ నైట్ కూడలి వద్ద అనాథ వృద్ధుడితో మాట్లాడుతున్న ఎస్ఐ



దుస్తులు వేయించి అనాథ ఆశ్రమానికి తీసుకెళ్తూ..

ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘనంగా నివాళి

రణస్థలం: ప్రజా గాయకుడిగా గద్దర్ అనేక పోరాటాలు చేసి సమాజానికి ఎంతో సేవలు అందించారని ఏపీ దళిత మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు కుప్పిలి రాముడు అన్నారు. మండల కేంద్రంలోని షాదీఖానా ఆవరణలో ఏపీ దళిత మహాసభ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.బెంజిమెన్ ఆదేశాల మేరకు రణస్థలం మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రజా గాయకుడు గద్దర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.

మండల శాఖ నూతన అధ్యక్షుడుగా పల్ల నీలయ్య, గౌరవ అధ్యక్షుడుగా సాకేటి పోతయ్య, ప్రధాన కార్యదర్శిగా కుప్పిలి పైడిరాజు, ఉపాధ్యక్షులుగా బంకపల్లి అప్పారావు, బోనెల పరశురాం, పల్ల అప్పన్న, గాడి రాజు, మామిడి జగదీశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా సమాధుల శ్రీను, ఎండతౌడు, నేతల పెంటయ్య, తోలాపి సూరిబాబు, యామల గోపాల్, కోశాధికారిగా టి.సూరప్పడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దుక్క అదినారాయణ, ప్రధాన సలహాదారులుగా గేదెల సురేష్, జి. రామారావు, సోషల్ మీడియా ప్రతినిధిగా ముక్కు రాములు ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గంలోకి కుప్పిలి సీతప్పడు, దుంగ సూర్యనారాయణ, దత్తు గోవిందలను నామినేట్ చేశారు.



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని వివిధ కోర్టుల్లో సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లాలోని పోలీస్ అధికారులతో సోమవారం జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని తెలిపారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు శ్రీకాకుళం జిల్లాలోని డీఎస్పీలు సీఐలు పెద్ద సంఖ్యలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి

ఎల్.ఎన్.పేట: మండలంలోని వంశధార పునరావాస కాలనీల్లో పనిచేసేందుకు ఎంపిక చేసిన ఇద్దరు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లుకు సోమవారం తన క్యాంప్ కార్యాలయం వద్ద పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి నియామక ఉత్తర్వులను అందజేశారు. బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరుత తీసుకురావాలన్నారు. ఉపాధి హామీ పథకం వేతనదారులకు పనులు కల్పించటంతో పాటు రైతులకు ఉపయోగపడేలా పని చేయించేలా విధులు నిర్వహించాలని సూచించారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెనుమజ్జి విష్ణుమూర్తి, సర్పంచ్ తొత్తడి మురళీకృష్ణ, పార్టీ నాయకులు లోచర్ల మల్లేశ్వరావు, బలగ గోవిందరావు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

సంతబొమ్మాళి: మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు చెందిన ట్రిప్పర్ ఢీ కొనడంతో ఓ యువకుడు గాయపడ్డాడు. నౌపడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలం హెచ్ ఎన్ పేట పంచాయతీ సీతారాంపురానికి చెందిన లక్ష్మినారాయణ పోర్టులో పనిచేసేందుకు ద్విచక్ర వాహనంపై సోమవారం వెళ్తున్నాడు. ఈ క్రమంలో మూలపేట శివాలయం వద్దకు వచ్చే సరికి అతి వేగంగా వెళ్తున్న ట్రిప్పర్ ఢీ కొనడంతో లక్ష్మినారాయణ ఎడమ కాలు విరిగిపోయింది. తీవ్రగాయాలతో ఉన్న ఆయనను స్థానికులు టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు నౌపడ పోలీసులు తెలిపారు. మరో వైపు తీవ్రంగా గాయపడిన వ్యక్తికి న్యాయం చేయాలని మూలపేట పోర్టు సమీపంలో బాధిత కుటుంబసభ్యులు నిరసన తెలియజేశారు.



తీవ్రంగా గాయపడిన లక్ష్మీనారాయణ



అందవరం వద్ద కూలిన వంతెన

జలుమూరు: మండలంలోని శివారు పంచాయతీ అందవరం వద్ద పోలాకి ఓపెన్ హెడ్‌కు అనుబంధంగా ఉన్న వంశధార కాలువపై ఉన్న వంతెన సోమవారం రాత్రి కూలిపోయింది. దీంతో సుమారు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ వంతెను యాభై ఏళ్ల కిందట కట్టారు. అప్పటి నుంచి ఈ వంతెనపై ఉప్పరపేట, అందవరం, గంగన్నపేట, గొల్లపేట, రామకృష్ణాపురం, పర్లాం, యాతపేట, మాకివలస, లింగన్నాయుడుపేట, తిమడాం తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన ఇటీవలే శిథిలావస్థకు చేరింది. దీనికి తోడు అధిక బరువు కలిగిన వాహనాలు వంతెనపై నుంచి వెళ్తుండడమే కూలిపోవడానికి కారణాలని స్థానికులు చెబుతున్నారు. వంతెన కూలిన వెంటనే రామకృష్ణాపురం, అందవరం గ్రామాలకు యువత వెంటనే అప్రమత్తమై అయి అటు రాకపోకలు జరగకుండా కర్రలు కట్టి నియంత్రించారు.